టీఎన్జీఓస్ డైరీ, కేలండర్ ఆవిష్కరణ


డైరీ, కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క, ఎమ్మెల్సీ కోదండరాం

అబిడ్స్: టీఎన్జీఓస్ హైదరాబాద్ జిల్లా 2024 డైరీ, కేలండర్‌ను ఆవిష్కరించారు. రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క, ఎమ్మెల్సీ కోదండరాంతో పాటు పలువురు ప్రముఖులు టీఎన్జీఓస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్ఎం.ముజీబ్ హుస్సేని ఆధ్వర్యంలో లలిత కళాతోరణంలో జరిగిన కార్యక్రమంలో వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం విశేష కృషి చేస్తుందన్నారు. ఈ సందర్భంగా పలు రంగాల్లో విశిష్ట సేవలందిస్తున్న 15 మందికి మంత్రులు ఘనంగా సత్కరించి మెమొంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీఓస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్ఎం.ముజీబ్ హుస్సేని, కాంగ్రెస్, పలువురు నాయకులు దైవాజ్ఞ శర్మ, అద్దంకి దయాకర్, మహ్మద్ ఫైముద్దీన్, జగదీశ్వర్, కస్తూరి వెంకట్, కొండల్ రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి శ్రీకాంత్, హరికృష్ణ, కేఆర్.రాజ్‌కుమార్, సీహెచ్. వెంకటేష్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో అధికారుల పాత్ర కీలకం


జలమండలి అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: సమస్యల పరిష్కారంలో అధికారుల పాత్ర కీలకమని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. శనివారం ఆయన టోలిచౌకి మేరాజ్ కాలనీలోని తన కార్యాలయంలో జలమండలి అధికారులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ.. వేసవి కాలంలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. ముఖ్యంగా లోప్రెషర్ సమస్య తలెత్తకుండా ముందుగానే జాగ్రత్త పడాలని ఆయన సూచించారు. ధ్వంసమైన తాగునీటి పైప్‌లకు వెంటనే మార్పాన్నారు. నల్లాలో వచ్చే తాగునీరు కలుషితం కావడం ప్రమాదకరంగా మారుతుందని ఆయన అన్నారు. ఈ విషయంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని సమస్య తలెత్తిన వెంటనే దానిని పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. రూ.297 కోట్లతో కార్వాన్ నియోజకవర్గంలో జరగనున్న పైప్‌లైన్ మహా ప్రాజెక్టు పనులను ఏప్రిల్ 16న ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ప్రారంభిస్తారని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జలమండలి డీజీఎం ఖాజా జవహర్ అలీ తదితరులున్నారు.

యువత పార్టీకి వెన్నెముక


లక్ష్మారెడ్డిని కలిసిన కిశోర్ కుమార్, శ్రీనివాస్‌గుప్తా

జియాగూడ: బీఆర్ఎస్ పార్టీకి యువత వెన్నెముకలాంటిదని మాజీ మంత్రి సి.లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం రాష్ట్ర బీఆర్ఎస్ కార్యాలయంలో కార్వాన్ అసెంబ్లీ యూత్ అధ్యక్షుడు మంగి కిశోర్‌కుమార్, ఉద్యమ నాయకుడు శ్రీనివాస్‌గుప్తా ఆయనను కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం కిశోర్ కుమార్ మాట్లాడుతూ..రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీలకు బీఆర్ఎస్ గట్టి పోటీని ఇస్తుందన్నారు.

'కాంగ్రెస్ పేద ప్రజల పార్టీ'

గోల్కొండ: కాంగ్రెస్ పార్టీ పేద, బడుగు, మైనార్టీ వర్గాల పార్టీ అని కాంగ్రెస్ కార్వాన్ ఇన్‌చార్జి ఉస్మాన్ బిన్ మహ్మద్ ఆల్‌హాజరీ అన్నారు. శనివారం ఆయన సమక్షంలో వివిధ పార్టీలకు చెందిన 50 మంది కాంగ్రెస్ సభ్యత్వం తీసుకున్నారు. ఈ సందర్భంగా వారికి ఆయన పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. తెలంగాణలో పదేళ్ల బీఆర్ఎస్ అవినీతి అక్రమ పాలనకు ఓటర్లు కాంగ్రెస్ పార్టీని గెలిపించి బీఆర్ఎస్‌ను ఓడించారని అన్నారు. నియోజకవర్గ సమస్యలను రాష్ట్ర మంత్రి, హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకువెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు దుర్గాప్రసాద్, శ్రీనివాస్, జగన్‌గౌడ్, దర్శన్‌కుమార్, వి. లక్ష్మణ్, శోభాపాండే తదితరులు పాల్గొన్నారు.

జాబ్ మేళాలను సద్వినియోగం చేసుకోవాలి


జాబ్‌మేళాలో ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ

యాకుత్‌పురా: జాబ్ మేళాలను సద్వినియోగం చేసుకోవాలని మజ్లిస్ పార్టీ అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ తెలిపారు. మజ్లిస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం యాకుత్‌పురా రెయిన్‌బజార్ జవహర్ పాఠశాలలో నిర్వహించి మెగా జాబ్‌మేళాకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..తమ పార్టీ ఆధ్వర్యంలో పాతబస్తీలోని వివిధ బస్తీలకు చెందిన యువతకు ఉద్యోగాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో యాకుత్‌పురా ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్, కార్పొరేటర్లు మహ్మద్ వసీవుద్దీన్, డాక్టర్ సమీనా బేగం తదితరులు పాల్గొన్నారు.

కొండపల్లి శేషగిరిరావు సేవలు చిరస్మరణీయం


పుస్తకావిష్కరణలో ఎమ్మెల్సీ సురభి వాణిదేవి, వీసీ ప్రొ. కవిత దరియానిరావు తదితరులు

విజయనగర్‌కాలనీ: డాక్టర్ కొండపల్లి శేష గిరిరావు ఐదు దశాబ్దాల పాటు కళారంగానికి అందించిన సేవలు చిరస్మరణీయమని ఎమ్మెల్సీ సురభి వాణిదేవి అన్నారు. జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైనార్ట్స్ యూనివర్సిటీ ప్రాంగణంలోని ఆడిటోరియం హాల్‌లో శనివారం కొండపల్లి శేషగిరిరావు శతజయంతి ఉత్సవాలను నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ..వివిధ కళారూపాలలో ఆయన వేసిన చిత్రాలలో జీవం ఉట్టిపడుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కొండపల్లి శేషగిరిరావు పేరిట రచించిన పుస్తకాన్ని విడుదల చేశారు. యూనివర్సిటీ వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ కవిత దరియానిరావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కొడాలి సుందర్‌కుమార్, ఫైనార్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ టి.గంగాధర్, కళాకారులు ఏలే లక్ష్మణ్, కె.వేణుగోపాల్ రావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అమీర్ అలీఖాన్‌కు సత్కారం


అమీర్ అలీఖాన్‌ను సత్కరిస్తున్న డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేని తదితరులు

అబిడ్స్: టీఎన్జీఓస్ యూనియన్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్ఎం.ముజీబ్ హుస్సేని శనివారం ఎమ్మెల్సీగా నియమితులైన అమీర్ అలీఖాన్‌ను ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. ముజీబ్ హుస్సేని మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అన్నివర్గాల వారికి సముచితస్థానం కల్పిస్తుందన్నారు. అమీర్ అలీఖాన్ ఆధ్వర్యంలో రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహ్మద్ నసిరుద్దీన్, వికాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయాలి


మూసాబౌలి చౌరస్తాలో ట్రాఫిక్ సిగ్నల్స్ లేక అడ్డదిడ్డంగా వెళ్తున్న వాహనాలు

చార్మినార్: చార్మినార్ ఔటర్ రింగ్ రోడ్డులోని మూసాబౌలి చౌరస్తాలో వాహనాల రద్దీ రోజు రోజుకూ పెరుగుతున్నందున వెంటనే ట్రాఫిక్ సిగ్నల్స్‌ను ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు. పాతబస్తీలోని ఇతర ప్రాంతాల నుంచి నగరంలోకి..నగరంలోని ఇతర ప్రాంతాల నుంచి పాతబస్తీకి వాహనాల రాకపోకలు మూసాబౌలి చౌరస్తా మీదుగానే జరుగుతుండటంతో ఇక్కడ వాహనాల రద్దీ అధికంగా ఉంటుంది. దీంతో మూసాబౌలి చౌరస్తా వద్ద వాహనాల రద్దీని క్రమబద్ధీకరించడానికి ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయడం ఎంతో అవసరముందని వాహనదారులు అంటున్నారు. సాధ్యమైనంత వెంటనే ట్రాఫిక్ సిగ్నల్స్‌ను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

విద్యార్థి దశలోనే

లక్ష్యాలను నిర్దేశించుకోవాలి

టీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ ● కన్నడ మీడియం విద్యార్థులకు అవార్డులు


అవార్డు గ్రహీతలతో వీసీ సజ్జనార్

నాంపల్లి: విద్యార్థి దశలోనే లక్ష్యాలను నిర్దేశించుకోవాలని సీనియర్ ఐపీఎస్ అధికారి, తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీఎస్ఆర్టీసీ) ఎండీ వీసీ సజ్జనార్ సూచించారు. మధురమైన మాతృభాషను పరిరక్షిస్తూనే బహుభాషా ప్రావీణ్యాలను పెంపొందించుకోవాలని అన్నారు. శనివారం హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నందమూరి తారక రామారావు కళా మందిరంలో తెలంగాణ, గోవా రాష్ట్రాల్లో కన్నడ మీడియం చదివి ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అవార్డుల ప్రదానోత్సవం జరిగింది. కన్నడ డెవలప్‌మెంట్ అథారిటీ ఆధ్వర్యంలో జరిగిన సభకు ముఖ్య అతిథిగా వీసీ సజ్జనర్ హాజరయ్యారు. కన్నడ మాధ్యమంలో 8వ, 9వ 10వ తరగతుల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సన్మానించి వారికి అవార్డులను ప్రదానం చేశారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ.. ఆంగ్ల మాధ్యమం ప్రభావం సమాజంపై ఎక్కువగా ఉన్న నేటి సమాజంలో కన్నడ మాధ్యమంలో విద్యను అభ్యసించి విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించడం అభినందనీయమన్నారు. మాతృ భాషలో పట్టు సాధిస్తూనే ఇతర భాషలను నేర్చుకోవాలని సూచించారు. నేడు ప్రపంచమంతా ఒక కుగ్రామంగా మారిందని, బహు భాషల్లో ప్రావీణ్యం సంపాదిస్తే భవిష్యత్‌లో మంచి ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. తాను కన్నడ లిటరేచర్‌ను అప్షనల్‌గా ఎంచుకుని సివిల్స్‌లో విజయం సాధించానని చెప్పుకొచ్చారు. మాతృ భాషలో పోటీ పరీక్షలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహిస్తున్నాయని, ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలన్నారు. జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలంటే అడ్డదారులు ఉండవని కష్టపడి సాధన చేస్తేనే లక్ష్యాలను అధిరోహిస్తామని పేర్కొన్నారు. తమ ఇష్టాయిష్టాలను పిల్లలపై తల్లిదండ్రులు రుద్దవద్దని, నచ్చిన రంగాన్ని ఎంచుకునేలా వారికి స్వేచ్ఛ ఇవ్వాలని సూచించారు. విజ్ఞానాన్ని పెంపొందించుకునేందుకు మంచి పుస్తకాలను చదవాలని, గ్రంథాలయం వెళ్లడం అలవాటు చేసుకోవాలని అన్నారు. స్మార్ట్ ఫోన్లలో గంటల కొద్ది గడపకుండా వ్యాయామం చేయాలని సూచించారు. సామాజిక మాధ్యమాల ప్రభావం విద్యార్థులపై ఎక్కువగా పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఏ మాత్రం పనికి రాని సామాజిక మాధ్యమాలను దూరంగా ఉంటేనే జీవితంలో పైకి వస్తారని వివరించారు. ఈ కార్యక్రమంలో కన్నడ డెవలప్‌మెంట్ అథారిటీ కార్యదర్శి సంతోష్ హంగల్, బెంగళూరుకు చెందిన ప్రొఫెసర్ సి.నంజున్‌దయ్య, కన్నడిగాస్ వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షులు ధర్మేంద్ర పూజారి, కర్ణాటక శిక్షణ సమితి కార్యదర్శి ముకుంద్ కులకర్ణి, మరత్వాడ-కన్నడ సంఘ్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ తెలంగ్ పాల్గొన్నారు.

కేలండర్ ఆవిష్కరణ


కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న ఉమా మహేశ్వరీ తదితరులు

సుల్తాన్‌బజార్: నాయీబ్రాహ్మణ జన సంస్థ నూతన సంవత్సర 2024 కేలండర్ ఆవిష్కరణ కార్యక్రమం శనివారం కోఠిలో జరిగింది. పద్మశ్రీ అవార్డు గ్రహీత డి.ఉమామహేశ్వరీ, నాట్య గురువు కళాకృష్ణ డాక్టర్ రాపోలు సుదర్శన్, బీజేపీ రాష్ట్ర నాయకులు సూర్యపల్లి శ్రీనివాస్‌లు కేలండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో దుర్గరాణి, సినీ డైరెక్టర్ రాము, రామకృష్ణ, నాయీబ్రాహ్మణ జన సంఘం అధ్యక్షుడు శ్రీధర్ మురారి పాల్గొన్నారు.

సన్మానం


కోదండరాంను సన్మానిస్తున్న టీపీసీసీ సెక్రెటరీ మనీలాల్‌షా, రాజేందర్ యాదవ్

అబిడ్స్: ఎమ్మెల్సీగా నియమితులైన ప్రొఫెసర్ కోదండరాంను టీపీసీసీ కార్యదర్శి మనిలాల్‌షా, రాష్ట్ర నాయకుడు రాజేందర్ యాదవ్ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..తెలంగాణ రాష్ట్ర ఏర్పాటునకు ఉద్యమ నాయకుడు కోదండరాం చేసి కృషి అమోఘమన్నారు. తెలంగాణ ఉద్యమకారులకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వ తగిన ప్రోత్సాహం ఇస్తుందని వారన్నారు.

అహంకారంతోనే బీఆర్ఎస్ పార్టీ పతనం


గౌరీ సతీష్

అబిడ్స్: అహంకారపూరిత మాటలతోనే బీఆర్ఎస్ పార్టీ పతనమవుతుందని రాష్ట్ర పీసీసీ అధికార ప్రతినిధి గౌరీ సతీష్ పేర్కొన్నారు. శనివారం గౌరీసతీష్ తన కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ..ఇటీవల కేటీఆర్ అహంకారపూరితంగా బీసీ మంత్రిని, ఎస్సీ ఎమ్మెల్యేలను బట్టలు విప్పుతానని అనడం దురహంకారానికి నిదర్శనమన్నారు. కేటీఆర్ తన అహంకారాన్ని పక్కకు పెట్టకపోతే కాంగ్రెస్ శ్రేణులు తమ తడాఖ చూపిస్తారని హెచ్చరించారు. కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు తలచుకుంటే కేటీఆర్ ఏ ప్రాంతంలో తిరుగలేడని గౌరీ సతీష్ అన్నారు. పదేళ్లపాటు అధికారంలో ఉన్న కేసీఆర్ ప్రభుత్వం బీసీ, ఎస్సీలను నట్టేట ముంచడంతోనే కేసీఆర్‌ను ప్రజలు తరిమికొట్టారని ఆయన పేర్కొన్నారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన

గోల్కొండ: గుడిమల్కాపూర్ డివిజన్‌లో పారిశుద్ధ్య పనులు ఎప్పటికప్పుడు చేయిస్తున్నామని బీజేపీ నాయకుడు దేవర వంశీ అన్నారు. శనివారం ఆయన తాళ్లగడ్డ, మహవీర్‌నగర్ తదితర ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే ప్రజలు రోగాల బారినపడకుండా ఉంటారని ఆయన పేర్కొన్నారు.


పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న బీజేపీ నేతలు

యువత అభ్యున్నతికి గన్‌ఫౌండ్రీ యువసేన కృషి


సిల్వర్‌జూబ్లీ వేడుకల్లో డాక్టర్ భీశ్వ సురేఖ, భీశ్వ ఓంప్రకాష్

అబిడ్స్: యువత అభ్యున్నతికి గన్‌ఫౌండ్రీ యువసేన ప్రత్యేక కృషి చేస్తుందని గన్‌ఫౌండ్రీ కార్పొరేటర్ భీశ్వ సురేఖ, బీజేపీ తెలంగాణ ఎస్సీమోర్చా ఉపాధ్యక్షుడు భీశ్వ ఓంప్రకాష్ పేర్కొన్నారు. 25 ఏళ్లుగా యువకుల సంక్షేమానికి, అభివృద్ధికి నిరంతరం పాటుపడుతున్నామన్నారు. గన్‌ఫౌండ్రీ యువసేన సిల్వర్‌జూబ్లీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పలు పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కర సేవకులను సైతం సన్మానించారు. అనంతరం డాక్టర్ సురేఖ, ఓంప్రకాష్ మాట్లాడుతూ..తమ యువసేన ఆధ్వర్యంలో ప్రోత్సాహం పొందిన పలువురు యువకులు వివిధ రంగాల్లో కొనసాగుతుండడం సంతోషంగా ఉందన్నారు.

కనుల విందుగా సంస్కృతి కళాతరంగిణి


కార్యక్రమానికి హాజరైన ఆర్.పి.పట్నాయక్, జమిని సురేష్, భరత్

నాంపల్లి: సంస్కృతి కళాధార, బాలత్రిపుర సుందరి నృత్య కళా నిలయం సంస్థల సంయుక్త నిర్వహణలో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నందమూరి తారక రామారావు కళా మందిరంలో 'సంస్కృతి కళాతరంగిణి'శీర్షికన శాస్త్రీయ నృత్యం, సంగీత వాద్యాల ప్రదర్శన కనుల విందుగా జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన పలు శాస్త్రీయ నృత్యాలు అలరింపజేశాయి. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు శాస్త్రీయ నృత్యం విభాగంలో అభినయతార, ఇన్‌స్ట్రుమెంటల్ విభాగంలో వాద్య మహర్షి, వోకల్ విభాగంలో స్వర భూషణ్, గురూస్ విభాగంలో కళారాధన అవార్డులను అందజేశారు. ముఖ్య అతిథిగా ప్రముఖ సంగీత దర్శకులు ఆర్.పి.పట్నాయక్ హాజరై నటులు జమిని సురేష్, కొరియోగ్రాఫర్ భరత్ కోమలపాటి (సన్నీ)లతో కలిసి అవార్డు గ్రహీతలను సత్కరించారు. ఈ కార్యక్రమంలో దీప్తి, సౌజన్య, శ్రీలత, అనీల్ తదితరులు పాల్గొన్నారు.

మహాద్భుతం.. శ్రీకృష్ణ రాయబార ఘట్టం

నాంపల్లి: తెలంగాణ రాష్ట్ర చలన చిత్ర రంగస్థల అభివృద్ధి సంస్థ సౌజన్యంతో శివాని ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గణతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం రాత్రి నాంపల్లి పబ్లిక్‌గార్డెన్స్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నందమూరి తారక రామారావు కళా మందిరంలో మహేశ్వరం అంబదాసు దంపతులకు సన్మానం జరిగింది. ముఖ్య అతిథులుగా బీజేపీ సీనియర్ నాయకురాలు దొంతి శిల్పారెడ్డి, ప్రముఖ దర్శకులు గూడ రామకృష్ణ, ప్రముఖ రంగస్థల నటులు మొవ్వ దేవనాథ సూరి, ఎస్వీ రంగారావు అవార్డు గ్రహీత డాక్టర్ గుంటి పిచ్చయ్య హాజరై మహేశ్వరం అంబదాసు దంపతులను సత్కరించారు. సభా ప్రారంభంలో రవళీరమేష్ శిష్య బృందంచే 'సీతా కల్యాణం'నృత్య రూపకం ఆకట్టుకుంది. గాన కోకిల కర్నెకోట మహేశ్వర్-శ్రీకృష్ణుడు, మాడిశెట్టి రమేష్-దుర్యోధనుడు/కర్ణుడు, కీర్తి అవార్డు గ్రహీత దొంతి జంగయ్య-అర్జునుడు/ద్రోణాచార్యుడు వేషధారణలో ప్రదర్శించి శయన దృశ్యం నాటకాన్ని ప్రదర్శించి రక్తికట్టించారు. అలాగే చివరగా శ్రీకృష్ణ రాయబార ఘట్టంలో బి.వి.కాటంరాజు-శ్రీకృష్ణుడు, పుచ్చ సాంబశివరెడ్డి-దుర్యోధనుడు, బి.ఎల్.శ్రీరామ్-వికర్ణుడు, మహేశ్వరం అంబదాసు-విదురుడు, ఒడ్డె సూర్య ప్రకాష్-ధృతరాష్ట్రుడు, ఎస్.రామచంద్రరావు-భీష్ముడు, వనపర్తి రాజేంద్ర ప్రసాద్-అశ్వత్థామ పాత్రలు పాత్రధారులుగా ఉన్నారు.

తెలుగు భాష మధురమైనది



నాంపల్లి: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో నిర్వహించిన కాశీపత్యవధానుల జయంతి ఉత్సవాలను రాష్ట్ర వినియోగదారుల సంఘాల సమాఖ్య చైర్మన్ వేముల గౌరీ శంకరరావు, ఆచార్య తంగెడ కిషన్ రావు, ఉమ్మడి ఏపీ రాష్ట్ర హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి డాక్టర్, జస్టిస్ జి.చంద్రయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలుగు మృత భాష కాదని.. మధురమైన భాష అని కొనియాడారు. ఎన్ని తరాలు మారినా తెలుగు భాష మాత్రం అజరామరంగా వెలుగొందుతుందన్నారు. అమెరికాలోని రాష్ట్రాల్లో సైతం 250 పాఠశాలల్లో తెలుగును బోధిస్తున్నట్లు వివరించారు. జస్టిస్ జి.చంద్రయ్య మాట్లాడుతూ.. మనిషి జీవించినప్పుడే కాకుండా మరణించిన వారిని కూడా గౌరవంగా సాగనంపడం మానవ హక్కే అవతుందన్నారు. కాశీపత్యవధానుల జయంతిని సగౌరవంగా నిర్వహించడం ద్వారా మానవ హక్కుకు సమున్నతమైన గౌరవం కల్పించినట్లు అవుతుందన్నారు. అనంతరం శతాధిక గ్రంథకర్త మహామహోపాధ్యాయ డాక్టర్ పెదపాటి నాగేశ్వరరావు, అష్టావధాని కంది శంకరయ్యలకు 'కవిసింహ' పోకూరి కాశీపత్యవధానుల పురస్కారాలను అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ జర్నలిస్టు పున్నా కృష్ణమూర్తి, సినీ నిర్మాత పులుసు సత్యారెడ్డి, గార్లపాటి గురుబ్రహ్మాచారి, పులుకూరి చంద్ర ప్రకాష్ పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం


షకీల్ ఖాన్ (ఫైల్)

గౌలిపురా: వ్యక్తి అదృశ్యమైన ఘటన భవానీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. తలాబ్ కట్టా ఆమన్‌నగర్-బీ ప్రాంతానికి చెందిన షకీల్ ఖాన్ (40)కు భార్య, నలుగురు పిల్లలు ఉన్నారు. ఈ నెల 11న ఉదయం 8 గంటలకు షకీల్ ఖాన్ పని నిమిత్తం అని ఇంట్లో నుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. ఆందోళన చెందిన భార్య షకీల్ ఖాన్ ఫోన్ నంబర్‌లో సంప్రదించగా ఎలాంటి స్పందన లేకుండా పోయింది. దీంతో స్నేహితులు, బంధువులు, స్థానిక ప్రాంతాల్లో వాకబు చేయగా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

చార్మినార్: టీఎస్ఎస్‌పీడీసీఎల్ చార్మినార్ సబ్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని చార్మినార్ సీబీడీ ఏడీఈ అఫ్జల్ బాబా ఓ ప్రకటనలో తెలిపారు. పత్తర్‌గట్టి విద్యుత్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాలార్‌జంగ్ మ్యూజియం విద్యుత్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 12 గంటల నుంచి 2 గంటల వరకు సరఫరా ఉండన్నారు. అలాగే ఖాజీపురా, రూప్‌లాల్ బజార్ తదితర రెండు విద్యుత్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాలలో మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండన్నారు.

పుత్లీబౌలి విద్యుత్ ఫీడర్ పరిధిలో..

అఫ్జల్‌గంజ్: 11 కే.వి పుత్లీబౌలి విద్యుత్ ఫీడర్ పరిధిలోని మహాత్మా గాంధీ బస్ స్టేషన్, అఫ్జల్‌గంజ్ బస్ స్టేషన్, సీబీఎస్ తదితర ప్రాంతాల్లో ఆదివారం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. అలాగే 11 కే.వీ ఫైర్ స్టేషన్ విద్యుత్ ఫీడర్ పరిధిలోని గురుద్వారా లేన్, అమృత్ బార్ లేన్ తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు అంతరాయం ఉంటుందన్నారు.

'దక్షిణాదిలో ఉత్తరాది వ్యాపారులను అడ్డుకుంటాం'

సుల్తాన్‌బజార్: సౌత్ ఇండియాపై నార్త్ ఇండియా వ్యాపారుల ఆధిపత్యాన్ని అడ్డుకోవాలని కోరుతూ శనివారం హైదరాబాద్‌లోని బేగంబజార్, సుల్తాన్‌బజార్, కోఠి తదితర ప్రాంతాల్లో సౌత్ సేన ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది. నార్త్ ఇండియా ఆధిపత్యాన్ని అడ్డుకోవాలని కోరుతూ కమర్షియల్ ట్యాక్స్ కమిషనర్ శ్రీదేవికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సౌత్ సేన నాయకులు రవి, శ్రీకాంత్, రమేష్ మాట్లాడుతూ..దక్షిణ భారతదేశంలో ఉత్తర భారతీయుల ఆధిపత్యం రోజు రోజుకూ పెరిగిపోతుందన్నారు. దక్షిణ భారత్‌లో నలుమూలలా విస్తరించిపోయారని, ఉత్తరాది వలసల కారణంగా ఇక్కడి ప్రజలు ఉద్యోగ, ఉపాధి వ్యాపార అవకాశాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దక్షిణాది వ్యాపారులు ఏకథాటిపైకి రావాలని వారు పిలుపునిచ్చారు.

ట్రాఫిక్ నియమాలు పాటించాలి


లారీ డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ఏసీపీ సత్యనారాయణ

సంతోష్‌నగర్: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలు పాటించాలని సౌత్, ఈస్ట్ జోన్ ట్రాఫిక్ ఏసీపీ కె.సత్యనారాయణ సూచించారు. రోడ్డు భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకొని శనివారం కర్మన్‌ఘట్‌లోని లారీ అడ్డా వద్ద లారీ డ్రైవర్లకు ఆయన సంతోష్‌నగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఇ.నర్సింహా నాయక్‌తో కలిసి రోడ్డు భద్రతాపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. లారీ డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలను తప్పకుండా పాటించాలని లేకపోతే కఠిన చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్సైలు వెంకటప్ప, సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు మెడల్స్ అందజేత


మెడల్స్ అందజేస్తున్న స్కూల్ ప్రిన్సిపాల్ నాగేశ్వర్, అమిత చరణ్

జియాగూడ: వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు మెడల్స్ ప్రోత్సాహక బహుమతులను అందజేసి వారిని ప్రోత్సహిస్తున్నట్లు శ్లోకా ది స్కూల్ ప్రిన్సిపాల్ నాగేశ్వర్ అన్నారు. శనివారం స్కూల్ ఆటస్థలంలో గెలుపొందిన విద్యార్థులకు మెడల్స్, ప్రశంస పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్లు రత్నేష్ జైస్వాల్, తిరుమలరావు, అన్వేష్, వైస్ ప్రిన్సిపాల్ అమితచరణ్ తదితరులు పాల్గొన్నారు.

'ఖేలో ఇండియా రెజ్లింగ్ పోటీల్లో సత్తాచాటుతాం'


రెజ్లింగ్ టీమ్ సభ్యులతో పాటు కోచ్ తదితరులు

గోల్కొండ: చెన్నైలో జరగనున్న ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌లో కార్వాన్‌కు చెందిన యువ రెజ్లర్లు తమ సత్తాచాటుతారని రెజ్లింగ్ కోచ్ కట్టా శ్రీనివాస్ అన్నారు. ఖేలో ఇండియా చాంపియన్‌షిప్‌లో పాల్గొనడానికి శనివారం ఉదయం ఆయన ఇతర కోచ్, రెజ్లింగ్ సభ్యులతో కలిసి చెన్నైకు బయలుదేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్వాన్‌కు చెందిన తనతో పాటు రెజ్లింగ్ కోచ్ అశోక్‌కుమార్ ఖేలో ఇండియా రెజ్లింగ్ పోటీల తెలంగాణ టీమ్ కోచ్‌లుగా ఎంపికయ్యారని ఆయన తెలిపారు.

29, 30వ తేదీల్లో నీటి సరఫరా బంద్

బహదూర్‌పురా: వివిధ ప్రాంతాలకు తాగునీటిని సరఫరా చేసే మిశ్రీగంజ్ రిజర్వాయర్‌ను క్లీనింగ్ చేయడం కారణంగా ఈ నెల 29, 30వ తేదీల్లో మంచినీటి సరఫరా ఉండదని హైదరాబాద్ మెట్రోపాలిటన్ నీటి సరఫరా, మురుగునీటి మండలి మిశ్రీగంజ్-2 డిప్యూటీ జనరల్ సబ్ డివిజన్ అధికారి మహ్మద్ హకీం తెలిపారు. క్లీనింగ్ కారణంగా పార్థివాడ, దూద్‌బౌలి, ఖబూతర్‌ఖానా, సునార్‌గల్లీ, మూసాబౌలి, షాగంజ్, జలాల్‌కుంచా, ముర్గీచౌక్, బారాగల్లీ, బైరుపియా గల్లీ, గులాబ్‌సింగ్ బౌలి, చెలాపురా, హైకోర్టు, షక్కర్‌కోట, కోకర్‌వాడీ, పేట్లబురుజు, రికాబ్‌గంజ్, మీరాలం, మిశ్రీగంజ్ ప్రాంతాల్లో నీటి సరఫరా ఉండదన్నారు. 48 గంటల అసౌకర్యాన్ని నివారించడానికి నీటిని పొదుపుగా వినియోగించుకోవాలన్నారు.

విశ్వకర్మ జాతి ప్రముఖులకు పద్మశ్రీ పురస్కారాలపై హర్షం

గన్‌ఫౌండ్రీ: కేంద్ర ప్రభుత్వం డాక్టర్ కూరెళ్ల విఠలాచార్యకు పద్మశ్రీ అవార్డును ప్రకటించడం పట్ల తెలంగాణ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ మాతృసంఘం హర్షం వ్యక్తం చేసింది. శనివారం బషీర్‌బాగ్‌లోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో అధ్యక్ష కార్యదర్శులు వేములవాడ మదన్‌మోహన్, చొల్లేటి కృష్ణమాచార్యులు మాట్లాడుతూ..కొన్నేళ్లుగా రెండు లక్షల బృందాలతో నడిచే గ్రంథాలను తన సొంత ఇంటిని గ్రంథాలయంగా మార్చిన డాక్టర్ కూరెళ్ల విఠలాచార్య, ప్రముఖ శిల్పి డాక్టర్ వేలు ఆనందాచార్యులకు పద్మశ్రీ పురస్కారాలను ఇవ్వడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మలను గుర్తించడం ఎంతో ఆనందంగా ఉందని అదే విధంగా విశ్వకర్మ జాతిలోని ప్రముఖుల పేరిట పురస్కారాలను అందజేయాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. ఈ సమావేశంలో సంఘం గౌరవ అధ్యక్షుడు డాక్టర్ లాలుకోట వెంకటాచారి, కోశాధికారి రవీంద్రచారి ఉపాధ్యక్షులు దేవరకొండ వీరాచారి శ్రీనివాసచారి, నగర అధ్యక్షులు భాస్కరాచారి తదితరులు పాల్గొన్నారు.